క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగుల సంఘ దినోత్సవంపై సమావేశం



సంఘం సభ్యులకు విరాళం అందిస్తున్న విశ్రాంత ఏఓ అల్లాబకాష్

కళ్యాణదుర్గం: విశ్రాంత ఉద్యోగుల సంఘం దినోత్సవం నిర్వహణపై అధ్యక్ష, కార్యదర్శులు శివ ప్రసాద్, కార్యదర్శి తిప్పేస్వామి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం సంఘం అభివృద్ధికి అల్లా బకాష్ తనవంతు సాయంగా రూ.10,116 అందించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మారెన్న, అంజినప్ప, ఫక్రుద్దీన్, భగవాన్ దాస్ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



విజయసాయి (ఫైల్)

కళ్యాణదుర్గం: పట్టణంలోని మారెంపల్లిలో ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విజయ సాయి అనే విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ విషయం సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉదయం ఎస్ఏ- 1 పరీక్షలు రాసి అనంతరం పాఠశాల నుంచి కనిపించకుండా వెళ్లినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. విద్యార్థి అదృశ్యంపై తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం పట్టణ పోలీసుల సహకారంతో పలు ప్రాంతాల్లో ఆచూకీ కోసం కలియతిరిగినా ఆచూకీ లభించలేదు. దీంతో పాఠశాల యాజమాన్యం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి



తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని మంజూరు చేయాలని అంబేడ్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షులు ఉలికేరి నాగార్జున కోరారు. సోమవారం తహసీల్దార్ మునివేలు విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ప్రకాష్, గౌరవ ఉపాధ్యక్షుడు సాకే రమేష్, ప్రధాన కార్యదర్శి కే.సి పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు వన్నూరుస్వామి, కోశాధికారి రాజశేఖర్, ప్రచార కమిటీ సభ్యులు సురేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన శశాంత్‌గౌడ్

ఉరవకొండ: స్థానిక పాతపేటలోని ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఈడిగ శశాంత్ గౌడ్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం హనీఫ్, పీడీ మారుతీప్రసాద్ తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, పీడీలు మాట్లాడుతూ ఈనెల 6 నుంచి విశాఖ పట్నం అనకాపల్లిలో జరిగిన అండర్-17 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించిన శశాంత్‌గౌడ్ అద్భుత ప్రతిభ చూపారన్నారు. దీంతో సెలక్టర్లు ఈనెల 23 నుంచి 26 వరకు అయోధ్యలో జరగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేశారన్నారు. సీనియర్ పీడీ మారుతీకి ఉపాధ్యాయులు, తదితరులు అభినందనలు తెలిపారు.

ధనుర్మాసం..పుణ్యప్రదం



రాయదుర్గంలో ధనుర్మాస పూజలందుకున్న సతీసమేత ప్రసన్న వేంకటరమణస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని వైష్ణవ ఆలయాలతోపాటు ప్రముఖ ఆలయాల్లో సోమవారం నుంచి ధనుర్మాస పూజలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ప్రధానంగా పట్టణంలో ప్రసిద్ధిగాంచిన కోటలో వెలసిన వైష్ణవ క్షేత్రం ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో సోమవారం నుంచి నెలరోజుల పాటు రోజూ ధనుర్మాస పూజలు జరుగుతాయని అర్చకులు బాలమురళీకృష్ణ తెలిపారు. స్వామికి పంచామృతాభిషేకం, నైవేద్యం, తిరుప్పావై సేవ, పుష్పార్చన, కుంకుమార్చన, ప్రసాద వినియోగ కార్యక్రమాలు జరిగాయి.



చైర్మన్ గిరి.. ఆ ఇద్దరి గురి!

- జీటీ ప్రాజెక్టు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ కుర్చీలు దక్కేదెవరికో?
- టీడీపీ, జనసేన మధ్య తీవ్రపోటీ
- ఈ నెల 20లోపు నోటిఫికేషన్ విడుదల
- ఇద్దరు ఎమ్మెల్యేల వద్ద మొదలైన పైరవీలు
- ఎడమ కాలువ పరిధిలోకే మెజార్టీ కోరం
- అదృష్టం వరించేదెవరికోనని అంతటా ఆసక్తి

రాయదుర్గం: ఇటీవల సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకాభిప్రాయంతో జరగలేదు. ఏకపక్షంగా ముగిశాయి. ఈ నేపథ్యంలో అడుగడుగునా అధికార దర్పం ప్రదరిస్తూ అన్ని స్థానాల్లోనూ పోటీ లేకుండా టీసీ మెంబర్లు, డబ్ల్యూఏ ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంటుగా కూటమి ఖాతాలోకి ఏకగ్రీవంగా వేసుకున్నారు. దీంతో ఇందులో బీటీ ప్రాజెక్ట్ చైర్మన్ కుర్చీ కీలకంగా మారనుంది.బీటీ ప్రాజెక్టు చైర్మన్, వైస్ చైర్మన్ల కుర్చీలు ఎవరికి దక్కుతాయోనని అంతటా ఆసక్తి నెలకొంది. కాగా టీడీపీ, జనసేన మధ్య తీవ్ర పోటీ ఉండగా, రాయదుర్గం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు కాలవ, అమిలినేని వద్ద పైరవీలు మొదలయ్యాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 48 మైనర్, 6 మీడియం, హెచ్ఎల్‌సీ డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని 11 మొత్తం 59 నీటి సంఘాలకు మూడు రోజుల క్రితం ఎన్నికలు ముగిశాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని గుమ్మఘట్ట (ఎడమ కాలువ), బ్రహ్మసముద్రం (కుడికాలువ) పరిధిలోని 12,400 ల ఎకరాల ఆయకట్టు ఉంది. విస్తీర్ణం ఆధారంగా గుమ్మఘట్ట మండలంలోని భూపసముద్రం, బేలోడు, కలుగోడు, గుమ్మఘట్టలో (నాలుగు), బ్రహ్మసముద్రం మండలంలోని వేపులపర్తి, బుడిమేపల్లిలో (రెండు) చోట్ల డబ్ల్యూఏ ప్రెసిడెంట్లు పాలక పక్షం కొలువుదీరింది. ఈ ఆరుగురిలో కోరం ఆధారంగా ప్రాజెక్ట్ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎంపిక చేయాల్సి వస్తోంది. సంఖ్యా బలం ఆధారంగా గుమ్మఘట్టకు చైర్మన్, బ్రహ్మసముద్రానికి వైస్ చైర్మన్ పదవి దక్కే అవకాశం ఉంది. ఈ నెల 20న ఈ ఎన్నిక ప్రక్రియ చేపట్టేందుకు నోటిఫికేషన్ వెలువడనుంది.

హంద్రీనీవా ద్వారా జీడిపల్లికి చేరే కృష్ణ జలాలను బీటీపీ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ పనులు త్వరితగతిన ప్రారంభించేలా కృషి చేస్తామంటూ ఇటీవల నేమకల్లు సభలోనూ చెప్పారు. ఈ నేపథ్యంలో చైర్మన్ పదవి సమర్థులకు కట్టబెడితేనే ప్రయోజనం. ప్రాజెక్ట్ నుంచి మరో వారంలో నీటి విడుదలకు ముహూర్తం ఖరారు కానుంది. రైతులను సమన్వయం చేసి చుక్కనీరు వృథా కాకుండా సర్దుబాటు చేయాల్సిన బాధ్యత చైర్మన్‌తో పాటు డబ్ల్యూఏ ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లు, టీసీ మెంబర్లపై ఉంటుంది.

సమర్థులైతేనే ప్రయోజనం..

టీడీపీ, జనసేన మధ్య తీవ్ర పోటీ?

చైర్మన్ కుర్చీ కోసం టీడీపీ, జనసేన పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. రాయదుర్గం జనసేన అధ్యక్షుడు మంజునాథగౌడ తల్లి కురుబ పార్వతమ్మ గుమ్మఘట్ట డబ్ల్యూఏ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన తల్లికి ఈ పదవి దక్కించుకోవాలనే పట్టుదలతో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు వద్ద పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి దాకా ఎలాంటి పదవులు దక్కని జనసేనకు తప్పక ఈ అవకాశం కలిసివస్తోందని ఆ పార్టీలోని మెజార్టీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు. అయితే టీడీపీలోని ఓ వర్గం తమకే అవకాశం కల్పించాలని పట్టుబడుతున్న సమాచారం. ఇదిలా ఉండగా బ్రహ్మసముద్రం మండలం బుడిమేపల్లి డబ్ల్యూఏ ప్రెసిడెంట్‌గా ఎన్నికైనా సుబాన్ ఈసారి బ్రహ్మసముద్రం మండలానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తోనూ చర్చలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఇద్దరు ఎమ్మెల్యేల చుట్టూ చైర్మన్ కుర్చీ వ్యవహారం తిరుగుతోంది. ఎవరికి అవకాశం దక్కుతుందోనంటూ రెండు నియోజకవర్గాల్లోనూ జోరుగా చర్చ సాగుతోంది.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



పూలకుంట రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంటలో ఆంజనేయస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయంలో కుంకుమార్చన, ఆకుపూజ, పుష్పాలంకరణ, పంచామృతాభిషేకం, మహామంగళారతి, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించిన రథంలో కొలువుదీర్చి గ్రామంలో పురవీధుల్లో మేళతాళాలతో ఘనంగా ఊరేగించి, మొక్కులు తీర్చుకున్నారు. స్వామి ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధమ్మ, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, హనుమప్ప, రామప్ప, నింగప్ప, మాజీ సర్పంచ్ ముసలరెడ్డి, వైస్ సర్పంచ్ నగేశ్, తాళ్లకెర వీరభద్రరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కుళ్లాయిస్వామి

కూడేరు: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు సహకారం అందించాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో లోకలైజేషన్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎల్ఎస్‌డీజీ), 2025-26 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీల్లో అభివృద్ధి పనుల ప్రణాళిక తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ, గృహ నిర్మాణ,వైద్య, విద్యాశాఖ అధికారులు హాజరయ్యారు. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి మాట్లాడారు. గ్రామ పంచాతీలు అభివృద్ధి పథంలో నడవాలంటే అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ డీఈ హనుమప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఎంఈఓ మహమ్మద్ బాషా, ఏఓ విజయకుమార్, హెల్త్ సూపర్ వైజర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళలను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు

- ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి



మాట్లాడుతున్న ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి

ఉరవకొండ: ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు సాధారణ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు ఆపడానికి 2013 చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో పనిచేసే చోట మహిళలు-లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేజిస్ట్రేట్, మండల లీగల్ సర్వీస్ కమిటీ ఉరవకొండ చైర్‌పర్సన్ దుర్గాకళ్యాణి మాట్లాడారు. 14, 15, 21 ఆర్టికల్స్‌పై వివరించారు. మహిళలను లైంగికంగా వేధింపులకు గురి చేస్తే కఠిన చట్టాలు అమలవుతాయన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ హేమలత, ఎంపీడీఓ రవి పాల్గొన్నారు.

సర్పంచులు, అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ దాస్

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లకు, అధికారులకు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ దాస్ నాయక్, ఈఓపీఆర్‌డీ దాస్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. గ్రామ పంచాయతీలు అభివృద్ధి కోసం ప్రణాళికలపై శిక్షణ తరగతులు నిర్వహించిన్నట్లు తెలిపారు. 19 గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పేదరిక నిర్మూలన, పర్యావరణ సుస్థిరత, సామాజిక సమానత్వంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ జేఈ జగదీష్, ఎంఈఓ మల్లికార్జున, సర్పంచులు పరమేశ్వ, వన్నల్లి రామాంజనేయులు, ముక్కన్న, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: విభిన్న ప్రతిభావంతులు తమకున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఉరవకొండ రూరల్ సీఐ చిన్నగౌస్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ఆర్డీటీ పాఠశాలలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఉరవకొండ రూరల్ సీఐ చిన్నగౌస్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. విభిన్న ప్రతిభావంతులు పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. అనంతరం స్థానిక ఆర్డీటీ పాఠశాల నుంచి మెయిన్‌రోడ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగస్వామి, డీటీ నరేష్‌కుమార్, ఎంఈఓ ఎర్రిస్వామి, వెలుగు ఏపీ ఎం లలిత, వైద్యాధికారి తేజశ్వి, శ్రీవినాయక మండల సమైఖ్య లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మిరప సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న హార్టికల్చర్ అధికారులు

కణేకల్లు: మిరపలో యాజమాన్య పద్ధతులను పాటించాలని రైతులకు కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ సూచించారు. సోమవారం మండలంలోని పూలచెర్లలో నిర్వహించిన అవగాహన సదస్సులో శాస్త్రవేత్తలు మిరప సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలిచ్చారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ మిరపలో తామర పురుగు దుర్తి అధికంగా ఉందని, పురుగులను గుడ్డు దశలోనే నాశనం చేయడానికి నీమాయిల్ 3ఎంఎల్ అసిఫేట్ 2 గ్రాముల పురుగు మందు ఒక లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. పొలంలో ఎకరాకు 30 నీటి అట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తెల్లపురుగులు ఎక్కువగా ఉంటే ట్రైసర్ డెలిగేడ్ పిచికారీ చేయాలన్నారు. కాయల మీద మచ్చ తెగులు ఉంటే ఆంట్రికి టాప్‌వన్ ఎంఎం ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మిరప పొలానికి కంచె పంటగా మొక్కజొన్న, జొన్న పంటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ మౌనిక, డీజీఎం మురళి, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

శివపార్వతులకు ప్రత్యేక పూజలు



శివపార్వతులకు పూజలు నిర్వహించిన దృశ్యం

కూడేరు: కూడేరులో ప్రసిద్ధిగాంచిన సంగమేశ్వర స్వామి పుణ్యక్షేత్రంలో సోమవారం శివపార్వతుల జోడులింగాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత పాలాభిషేకం, రుద్రాభిషేకం చేపట్టి తర్వాత భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు.

జరుట్లరామలింగేశ్వరుడికి అభిషేకాలు

వజ్రకరూరు:జరుట్లరాంపురంలో జరుట్లరామలింగేశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. సోమవారం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు,రుద్రాభిషేకం, అర్చనలు, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. నగరేశ్వర స్వా మి, భోగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.

జంబుకేశ్వరుడికి విశేష పూజలు

రాయదుర్గంటౌన్: కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు రామకృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో జంబుకేశ్వరుడికి ద్రాక్ష పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు.

ముగిసిన మచ్చంద్రయ్య జాతర



విడిదిలో స్వామివారు

కుందుర్పి: కొలిమిపాళ్యంలో మచ్చంద్రమయ్య జాతర వెండి పల్లకీ ఉత్సవం, పానకంబండ్ల ఊరేగింపుతో ముగిసింది. సోమవారం ఉదయం స్వామిని వెండి పల్లకీలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయం చుట్టూ పానకం బండ్లను మూడుసార్లు ప్రదక్షిణలు చేయించారు.

ఘనంగా ఆవుల జాతర

బ్రహ్మసముద్రం : నంజాపురంలో చిత్ర లింగేశ్వర స్వామి ఆవుల జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామికి పూజాది కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఆవుల గూడువద్ద స్వామిని కొలువుదీర్చారు. వ్యాధులు రాకుండా పాడి పశువులు, జీవాలకు ప్రదక్షిణలు చేయించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ రవిబాబు

కంబదూరు: రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో మెలగాలని డీఎస్పీ రవిబాబు సూచించారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో మండలంలోని రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వరాదని, గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోకపోతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ నీలకంఠేశ్వర, ఎస్ఐ ప్రవీణ్, ఏఎస్ఐ ఓబుళపతి పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉంచండి

రాయదుర్గంటౌన్: జన్యు, ఎంజైముల లోపంతో బాధపడుతున్న హిమోఫీలియా బాధితులకు అత్యవసరమైన ఫ్యాక్టర్ ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలని బాధితులు కోరారు. ఈ మేరకు రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలోని బాధితులు తహసీల్దార్ నాగరాజును సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. రాయదుర్గం పరిధిలో 11 మంది హిమోఫీలియా వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి హిమోఫీలియా ఇంజక్షన్‌ను ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాలని హిమోఫీలియా బాధిత సొసైటీ సభ్యులు అనిల్ బాబు, పాటిల్ సదాశివారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సురేష్ తదితరులు విన్నవించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్



10వ వార్డులో అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్

రాయదుర్గంటౌన్: చలితీవ్రతతో సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు.సోమవారం ఆరో సచివాలయం పరిధిలోని 10వ వార్డు చౌడమ్మ గుడి ఏరియాలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లలు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలని, అప్రమత్తంగా లేకపోతే ఈ సీజన్‌లో నిమోనియా లాంటి ప్రాణాంతక వ్యాధులు బారినపడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శాంత కుమారి, హెల్త్ సెక్రటరీలు శోభ, సరోజ, ఈశ్వరమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజవల్లిలో ప్రీ క్రిస్మస్ వేడుకలు



దుస్తులు పంపిణీ చేస్తున్న పాస్టర్లు

కుందుర్పి: మండలంలోని నిజవల్లి గ్రామంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు సోమవారం నిర్వహించారు. స్థానిక చర్చిలో బ్యూలా ప్రార్థన సహవాసం హైదరాబాద్ నుంచి వచ్చిన పాస్టర్లు, క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వందమంది క్రైస్తవులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ విజయ్‌కుమార్, వివిధ గ్రామాల నుంచి క్రైస్తవులు పాల్గొన్నారు.

ముచ్చటగా ముగ్గురు హాజరు



ప్రజాసమస్యలపరిష్కార వేదికలో పాల్గొన్న అధికారులు

శెట్టూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ముచ్చటగా మూడు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. సుమారు 16శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉంది. ప్రధానంగా సాధారణ సమస్యలు, వ్యవసాయం, విద్యుత్, హార్టికల్చర్, పశు వైద్యం, ఇతర సమస్యలతో ప్రజలు వస్తారు. అయితే సంబంధిత శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో ప్రజలు నిరుత్సాహంతో వెనుదిరిగారు.

సంక్షిప్త సమాచారం

వృద్ధులకు దుప్పట్లు, నగదు పంపిణీ

కుందుర్పి: స్థానిక అక్షయ దివ్యాంగ సేవా సంస్థ ఆధ్వర్యంలో అనాథ పిల్లలు, వృద్ధులకు దుప్పట్లు, నగదు పంపిణీ చేసినట్లు దివ్యాంగుల సంఘం నాయకులు వెంకటేష్,ఉమాపతి, శ్రీనివాసులు తదితరులు సోమవారం తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ నగేష్ తదితరుల చేతుల మీదుగా అందించినట్లు తెలిపారు.

ఆధార్ ఆపరేటర్లపై చర్యలు తీసుకోవాలి

కుందుర్పి: మండలంలోని నిజవల్లి, మహంతపురం ఆధార్ సెంటర్లలో పనిచేస్తున్న ఆధార్ ఆపరేటర్ల (డిజిటల్ అసిస్టెంట్లు)పై చర్యలు తీసుకోవాలని కుసుమగిరి రైతు సంఘం సీఈఓ నరసింహమూర్తి ఆర్డీఓ వసంత బాబుకు సోమవారం ఫిర్యాదు చేశారు.

నేడు మహాగణపతి విగ్రహ ప్రతిష్ట

బెళుగుప్ప: మండల కేంద్రంలోని కొల్హాపురి మహాలక్ష్మి ఆలయం వద్ద మహాగణపతి విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా మహాగణపతి హోమం, ప్రాణ ప్రతిష్ట పూజలను నిర్వహించనున్నారు. విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలను శనగప్పగారి ఎల్లమ్మ , గ్రామస్తుల సహకారంతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు మంజూరు చేయండి

బొమ్మనహాళ్: ఇల్లు లేని పేదలందరికీ ఇంటి స్థలం ఇచ్చి, ప్రతి ఒక్కరికీ గృహాలు మంజూరు చేయాలని సీపీఐ తాలుకా కార్యదర్శి నాగార్జున, మండల ఇన్‌చార్జ్ కొట్రేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఇల్లు లేని నిరుపేదలతో అర్జీలు స్వీకరించి సీపీఐ ఆధ్వర్యంలో 200 అర్జీలను తహసీల్దార్ మునివేలుకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామాంజి, సుధా, దుర్గెప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుమ్మఘట్టలో రెవెన్యూ సదస్సు

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గ్రామ రెవెన్యూ సదస్సును మంగళవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘంలోని 13వ వార్డు సచివాలయం, 16వ వార్డు సచివాలయాల్లో ఈ నెల 17 నుంచి 20 వరకు నాలుగు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి తెలిపారు. కోటవీధిలోని 13వ సచివాలయం, బళ్లారి రోడ్డులోని 16వ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కూడేరు: మండల వ్యాప్తంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాని నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గౌస్ సోమవారం తెలిపారు. కూడేరులోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతన పరికరాలు ఏర్పాటు, కొన్నింటికి మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కంబదూరు: మండలంలోని కొత్త ఐపార్సుపల్లి గ్రామంలో దివంగత నీరుగంటి బజ్జన్న, అక్కమ్మల జ్ఞాపకార్థం ఎంపీటీసీ మాధవి,వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం గుండె వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కిమ్స్ సవేరా ఆస్పత్రి వైద్యులు గుండె జబ్బుతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు బీమేష్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.